సాక్షి యాదాద్రి భువనగిరి

ఆదివారం । 19 । ఫిబ్రవరి । 2023



బీజేపీ బలోపేతానికి కృషి

రానున్న ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. - 9లో



21న యాదాద్రికి అఖండజ్యోతి

బర్కత్‌పుర నుంచి శనివారం బయలుదేరిన అఖండజ్యోతి ఈనెల 21న యాదాద్రి పుణ్యక్షేత్రానికి చేరుకోనుంది. - 10లో

గరిష్టం/కనిష్టం 34°/17°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది రాత్రి చలి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బునాదిగాని కాల్వను పూర్తి చేయకపోతే ఉద్యమం



కార్యకర్తలతో కలిసి కాల్వను పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

ఆత్మకూరు(ఎం) : బునాది కాల్వను ఎప్పటిలోగా పూర్తి చేస్తారో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత స్పష్టం చేయాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతామని పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ పేర్కొన్నారు. ఆత్మకూర్(ఎం) మండల పరిధిలో బునాదిగాని కాల్వలను శనివారం పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన పరిశీలించారు. కాల్వ పూర్తయితే బీబీనగర్, భువనగిరి, వలిగొండ, మోటకొండూరు, మోత్కూరు, అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం) మండలాల రైతులకు సాగు నీరు అందుతుందన్నారు. అదే విధంగా బునాదిగాని కాల్వను బస్వాపూర్ రిజర్వాయర్‌కు అనుసంధానం చేసి గోదావరి జలాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, సీనియర్ నాయకులు అంజిరెడ్డి, సంగు నరేందర్, మండల కార్యదర్శి వేముల భిక్షం, నాయకులు రచ్చ గోవర్ధన్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు



మాట్లాడుతున్న డీఈఓ నారాయణరెడ్డి

ఆలేరు రూరల్: విద్యార్థులు ఏకాగ్రత, పట్టుదలతో చదివితే సాధించలేనిదంటూ ఏదీ ఉండదని డీఈఓ నారాయణరెడ్డి, ఆలేరు జూనియర్ సివిల్ జడ్జి సూర సుమలత అన్నారు. శనివారం ఆలేరులోని రామకృష్ణ విద్యాలయంలో నిర్వహించిన రామకృష్ణ పరమహంస జయంతి, పాఠశాల వార్షికోత్సవ వేడుకలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు సంస్కారం అలవర్చుకోవాలన్నారు. ప్రాథమిక దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలని సూచించారు. కష్టపడి చదివి ప్రయోజకులై తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, ఉన్న ఊరికి పేరు తేవాలన్నారు. వ్యక్తిత్వ వికాసంతో కూడుకున్నదే నిజమైన విద్య అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బండిరాజుల శంకర్, మల్లేశం, పోరెడ్డి రంగయ్య, వెంకటేష్, జగన్ మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : ఈ నెల 23నుంచి 26వరకు నిర్వహించే ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ 19వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఉత్తర తెలంగాణ జిల్లా ఇన్‌చార్జ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జాతీయ మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీని భలోపేతం చేస్తూ యువతను, మహిళలను పెద్ద ఎత్తున ఉద్యమాల్లోకి తీసుకొచ్చే విధంగా కృషి చేయడంతో పాటు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.ఏ.సమీఖాద్రి, పరంగి రాము, అందె బీరయ్య, స్టీఫెన్ పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భారత్'లో నమోదు చేసుకోవాలి

భువనగిరిటౌన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వినియోగదారుల సేవా కేంద్రం జిల్లా మేనేజర్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన వారంతా పథకానికి అర్హులని, ప్రస్తుతం జిల్లాలో 6,16,350 మంది ఉన్నారని పేర్కొన్నారు. అర్హులు వినియోగదారుల సేవా కేంద్రాలకు వెళ్లి ఆయుష్మాన్ భారత్ పథకం పోర్టల్‌లో చేసుకోవాలని సూచించారు. పథకంలో నమోదైన వారు దేశంలో ఎక్కడైన రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం పొందవచ్చన్నారు. వివరాల కోసం సెల్ నంబర్ 7798077982ను సంప్రదించాలన్నారు.

దివ్యాంగులకు సర్కారు చేయూత

- బ్యాంకు ద్వారా సబ్సిడీ రుణాలు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఈనెల 28 చివరి గడువు

భువనగిరిటౌన్ : జిల్లాలో దివ్యాంగులకు ఆర్థిక చేయూత ఇవ్వడంకోసం రాష్ట్ర ప్రభుత్వం రుణాలు అందజేయనుంది. గతంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మాత్రమే రుణాలు ఇవ్వగా ప్రస్తుతం దివ్యాంగులకు కూడా అందజేయాలని నిర్ణయించింది. దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బ్యాంకుల ద్వారా సబ్సిడీపై ఆర్థిక సహాయం చేయనుంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో 17 మండలాల, 6 మున్సిపాలిటీలకు గాను 23 యూనిట్లు మంజూరయ్యాయి. వీటిలో 20 యూనిట్లను బ్యాంకుతో సంబంధం లేకుండా 100 శాతం రాయితీతో రూ.50 వేల చొప్పున అందజేయనున్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా మూడు 3 యూనిట్లు ఇవ్వనున్నారు.

యూనిట్‌ల వారీగా సబ్సిడీ ఇలా..

బ్యాంకు ద్వారా అందజేసే రుణాలు 3 యూనిట్లుగా ప్రకటించారు. ఇందులో రూ.లక్ష, రూ.2 లక్షలు, రూ.3 లక్షల యూనిట్ ఒక్కొక్కటి ఉన్నాయి. లక్ష రూపాయల యూనిట్‌కు రూ.80వేల రాయితీ ఇవ్వనున్నారు. మిగతా రూ.20వేలు బ్యాంకు చెల్లిస్తుంది. రెండు లక్షల రూపాయల యూనిట్‌కు రూ. 1,40,000 రాయితీ, రూ.3లక్షల యూనిట్‌కు రూ.1.80లక్షల రాయితీపై రుణం ఇవ్వనున్నారు.

అర్హతలు, దరఖాస్తు విధానం

21 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సున దివ్యాంగులు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఈ నెల 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



దివ్యాంగులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆసక్తి, అర్హత కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.ఈ నెల 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాల కోసం జిల్లా సంక్షేమ కార్యాలయంలో సంప్రదించాలి.

-కేవీ కృష్ణవేణి, జిల్లా సంక్షేమ అధికారి

శివోహం



చౌటుప్పల్ : శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



రమణేశ్వరంలో బంగారు శివలింగానికి అభిషేకం చేస్తున్న గూడూరు నారాయణరెడ్డి



భువనగిరి : పచ్చలకట్ట సోమేశ్వరాలయంలో భక్తుల రద్దీ



చౌటుప్పల్ : కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

పేలుడుపై నిఘా!

యథేచ్ఛగా పేలుడు పదార్థాల అక్రమ వ్యాపారం

- వెంచర్లు, క్వారీలు, ఇతర అవసరాలకు విచ్చలవిడిగా విక్రయం
- నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్‌లు
- నిఘా పెంచిన రాచకొండ పోలీసులు
- పెద్ద ఎత్తున పట్టుబడుతున్న జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు
- గతంలోనూ వెలుగుచూసిన ఘటనలు



ఆలేరు మండలంలో పట్టుబడిన జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్ల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ (ఫైల్)

సాక్షి, యాదాద్రి : కావాలనుకున్న వారికి.. జిల్లాలో సులువుగా పేలుడు పదార్థాలు లభిస్తున్నాయి. వెంచర్లు, క్వారీలు, బావుల తవ్వకాల్లో బ్లాస్టింగ్‌లు చేయడానికి యజమానులు అడ్డదారుల్లో వాటిని కొనుగోలు చేస్తున్నారు. పేలుడు పదార్థాల అక్రమ రవాణా, వినియోగిస్తున్న వారిపై కొంతకాలంగా నిఘా పెట్టిన ఎస్‌ఓటీ పోలీసులు అనుమానిత ప్రాంతాల్లో దాడులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని కందిగడ్డతండా, గుండాల, బ్రాహ్మణపల్లిలో పెద్ద ఎత్తున జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు, మేగ్జర్ బాక్సులు, కనెక్టింగ్ వైర్, బ్లాస్టింగ్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి సైతం రవాణా

పేలుడు పదార్థాలను జిల్లా డీలర్లతో పాటు వరంగల్, ఖమ్మం, సిద్దిపేట, జనగామ, సూర్యాపేట జిల్లాల డీలర్ల నుంచి సైతం రవాణా అవుతున్నాయి. నిబంధనల ప్రకారం పేలుడు పదార్థాలను ఎక్స్‌ప్లోజివ్స్ వాహనాల్లో మాత్రమే తరలించాలి. కానీ, నిబంధనలకు విరుద్ధంగా గోనె సంచులు, కూరగాయల బ్యాగుల్లో కార్లు, టాటాఏస్‌లు, ద్విచక్ర వాహనాల్లో అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా అక్రమ మార్గం పడుతున్న పేలుడు పదార్థాలు క్వారీలు, వెంచర్లు, క్రషర్లు, బావుల తవ్వకం తదితర వ్యవహారాలకు వినియోగిస్తున్నారు. అయితే వీటి వినియోగం పరిమితికి మించుతుండడంతో ఆందోళన కలిగిస్తోంది. ఎక్కువగా భువనగిరి మున్సిపాలిటీ, భువనగిరి మండలం, బొమ్మలరామారం, బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్, యాదగిరిగుట్ట, తుర్కపల్లి మండలాల్లో పేలుడు పదార్థాల వినియోగం ఎక్కువగా ఉంది.

నిఘా పెంచిన ఎస్‌ఓటీ పోలీసులు

ఇటీవల వెలుగు చూసిన ఘటనల నేపథ్యంలో నూతనంగా వచ్చిన సీపీ, డీసీపీలు ఎస్‌ఓటీ (స్పెషల్ ఆపరేషన్ టీం) పోలీసులను మరింత అప్రమత్తం చేశారు. జిల్లాకు పేలుడు పదార్థాల రవాణా జరుగుతున్న ప్రాంతాలు, సంబంధిత వ్యక్తులు, డ్రైవర్లు, డీలర్లు, సబ్ డీలర్లపై ప్రత్యేక దృష్టి సారించారు. పేలుడు పదార్థాలు, వాటి తయారీకి వినియోగించే మెటీరియల్ రవాణా చేసే వాహనాలు వచ్చిపోయే రూట్లపైనా నిరంతర నిఘా ఉంచారు. అంతేకాకుండా పేలుడు పదార్థాల వ్యాపారులు, డీలర్ల నుంచి సమాచారం రాబడుతున్నట్లు తెలుస్తోంది.

డీలర్లే సమాచారం ఇస్తున్నారా?

పేలుడు పదార్థా వ్యాపారం లాభసాటిగా మారింది. దీంతో ఇటీవల కాలం పెద్ద ఎత్తున ఈ వ్యాపారంలోకి అడుగుపెడుతున్నారు. వ్యాపారం ప్రమాదకరం అని తెలిసినప్పటికీ ధనార్జనే ధ్యేయంగా అక్రమ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. అయితే స్థానిక డీలర్లు, సబ్ డీలర్లు, ఇతర ప్రాంతాల డీలర్ల మధ్య వ్యాపార పోటీ పెరిగింది. దీంతో డీలర్లే ఒకరిపై మరొకరు పోలీసులకు ఉప్పందిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పేలుడు పదార్థాలు తరలించే వాహనాలు బయలుదేరగానే పోలీసులకు క్షణాల్లో సమాచారం చేరుతుండడం గమనార్హం.

జిల్లాలో కంపెనీలు

జిల్లాలో పేలుడు పదార్థాలు తయారు చేసే కంపెనీలతో పాటు మ్యాగ్జేన్స్, అమ్మోనియం నైట్రేట్ నిల్వ చేసే పాయింట్లు 18 వరకు ఉన్నాయి. వీటి నుంచి పేలడు పదార్థాలు అక్రమ మార్గం పడుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. తయారీ, వినియోగం, వాడగా మిగిలింది వాపస్ చేసే వరకు లెక్కలు పక్కాగా ఉండాలి. కానీ, ఏ కంపెనీలో, డీలర్ వద్ద రికార్డులు ఉండటం లేదని తెలుస్తోంది.

నిరంతరం నిఘా



జిల్లాలో పేలుడు పదార్థాల కంపెనీలు, డీలర్లు, వినియోగంపై నిరంతరం నిఘా ఉంచాం. అనుమతి లేకుండా పేలుడు పదార్థాలు విక్రయించినా, నిల్వ చేసినా, రవాణా చేసినా సంబంధికులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆలేరు, గుండాల, బీబీనగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇటీవల ప్రమాదకరమైన పేలుడు పదార్థాలు పట్టుకున్నాం. ఇవి ఎక్కడి నుంచి వస్తున్నాయని విచారణ జరుపుతున్నాం. వెంచర్లు, క్వారీల పైనా నిఘా పెట్టాం.

-రాజేశ్‌చంద్ర, డీసీపీ

కొన్ని ఘటనలు..

- ఆలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కందిగడ్డతండా శివారులో 57 జిలిటిన్ స్టిక్స్, 51 డిటోనేటర్లు, కనెక్టింగ్ వైర్ బిండలు, వాహనాలను పట్టుకున్నారు.
- గుండాల, బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లిలో పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలు పట్టుకుని నిందితులపై కేసులు నమోదు చేశారు.
- రాజాపేట మండలం రామచంద్రాగూడెంలో బక్కెన శివుడు అనే రైతుకు చెందిన ఆవు గడ్డి మేస్తూ అడవి పందుల కోసం వేటగాళ్లు పెట్టిన పదార్థం తిన్నది. ఇది పేలడంతో ఆవు మృతి చెందింది.
- రెండేళ్ల క్రితం ఆత్మకూర్(ఎం) మండలం పల్లెర్లలో కుక్క పేలుడు పదార్థాన్ని కొరకగా అది పేలడంతో మృత్యువాత పడింది.
- జిల్లాకు చెందిన పేలుడు పదార్థాలు ఇతర జిల్లాలోనూ పట్టుబడ్డాయి.
- అక్రమంగా సరఫరా చేస్తున్న లైసెన్స్ డీలర్లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని పీడీ యాక్టు నమోదు చేశారు.



మూడు రోజుల క్రితం బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లిలో పట్టుబడ్డ పేలుడు పదార్థాలు

అవిశ్వాసం అంశం పార్టీ చూసుకుంటుంది

- కొంతమంది సొంత ఎజెండాతో వ్యవహరిస్తున్నారు
- ఇప్పటికైనా అపోహలు వీడి అభివృద్ధి కోసం కలిసిరావాలి
- చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు



అభివృద్ధి పనుల వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడిస్తున్న చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

చౌటుప్పల్ : కౌన్సిలర్లు తనపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన అంశాన్ని బీఆర్‌ఎస్ పార్టీ నాయకత్వం చూసుకుంటుందని చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంత మంది సొంత ఎజెండాతో వ్యవహరిస్తున్నారని, చట్ట ప్రకారం ముందుకెళ్తానన్నారు. మూడు సంవత్సరాల కాలంలో మున్సిపాలిటీలో అభివృద్ధి జరగలేదని ప్రచారం చేయడంలో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు పూర్తయినవి, టెండర్ల దశలో ఉన్నవి, ప్రతిపాదనలో ఉన్న పనులకు కలిపి రూ.16.58 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి చేపట్టిన అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పట్టణ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని శాశ్వత ప్రయోజనాలకోసం తాను ప్రయత్నిస్తుండగా.. కొంత మంది అభివృద్ధి జరగడం లేదని ప్రచారం చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా అపోహలు వీడి కలిసి రావాలని, ఆత్మ పరిశీలన చేసుకొని అభివృద్ధికి సహకరించాలని కోరారు. రానున్న రోజుల్లో చౌటుప్పల్ మున్సిపాలిటీని మోడల్ సిటీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. ఏదేమైనా క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయం మేరకు ముందుకు నడుస్తానన్నారు.

పంచ నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరచిన ఆచార్యులు.. శ్రీస్వామి వారికి సుప్రభాతం చేపట్టారు. అనంతరం ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. ఇక ఆలయ ముఖ మండపంలోని ఉత్సవ మూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన, ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవోత్సవం జరిపించారు. ఆయా వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. శివరాత్రి సందర్భంగా ఆలయంలో కోలాహలం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



ఉత్సవమూర్తులకు హారతినిస్తున్న ఆచార్యులు

జేఎస్‌వీలో కుళ్లిపోయిన కూరగాయలు

- ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు

పెద్దవూర : నల్లగొండ జిల్లా పెద్దవూర మండల పరిధిలోని చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయం(జేఎస్‌వీ)లో భోజనం సక్రమంగా ఉండడం లేదని శనివారం మధ్యాహ్నం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. వంటగదిలో పాచిపోయిన కూరగాయలు, బూజుపట్టిన పప్పులు ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ అన్నింటినీ బయట పడేశారు. విద్యార్థులకు మెనూ అమలు చేయకుండా నాసిరకం కూరగాయలతో భోజనం పెట్టడంపై పాఠశాల ఉపాధ్యాయులను నిలదీశారు. రెండు మూడు రోజుల్లో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని సంబంధిత అధికారులు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు

కనువిందుగా రాచకొండ ఉత్సవాలు



ఫొటో గ్యాలరీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల



కళాకారుల నృత్య ప్రదర్శన

- తరలివచ్చిన పర్యాటకులు, విద్యార్థులు

సంస్థాన్ నారాయణపురం : రాచకొండ పర్యాటక ఉత్సవాలు శనివారం కనుల పండువగా మొదలయ్యాయి. ఈ ఉత్సవాలను ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచకొండకు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. రాబోయే రోజుల్లో రాచకొండ ప్రాంతం మరెంతో అభివృద్ధి చెందుతుందన్నారు. పర్యాటకుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. ఆకట్టుకున్న ఫొటోగ్యాలరీ, సాంస్కృతిక ప్రదర్శనలుఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన రాచకొండ చరిత్రను తెలిపే ఫొటో గ్యాలరీ ఆకట్టుకుంది.ఎమ్మెల్యేతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, పర్యాటకులు ఫొటో గ్యాలరీని వీక్షించారు. శివపార్వతుల నాట్యం, పేరిణి నాట్యం, ఒగ్గుకళాకారుల ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వీరమళ్ల భానుమతి, పీఏసీఎస్ చైర్మన్ జక్కిడి జంగారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రాజు, సీఐ రాజప్ప, ఎంపీడీఓ రాములు, సత్తిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ఒగ్గు గణేష్, పల్లె గోవర్ధన్‌రెడ్డి, రాచప్ప సమితి అధ్యక్షుడు బద్దుల కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి సూరపల్లి వెంకటేశం, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

జలాల్‌పురంలో మోడల్ పార్క్

- కలెక్టర్ చొరవతో ఏర్పాటు
- పూర్తికావొచ్చిన పనులు
- ప్రారంభానికి సన్నాహాలు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పురం పర్యాటక శోభను సంతరించుకుంది. చెరువు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న లేక్‌వ్యూ పార్కు జిల్లాలోనే మిగతా పార్కులకు ఆదర్శంగా రూపుదిద్దుకుంటోంది. పార్కులో సుందరీకరణ పనులు దాదాపు పూర్తి కావడంతో పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

పర్యాటకులను ఆకట్టుకునేలా..

కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ చొరవతో లేక్ వ్యూ పార్కు ఏర్పాటు చేస్తున్నారు. జలాల్‌పురం చెరువు సమీపంలో పార్కు ఏర్పాటు చేస్తే భూదాన్ పోచంపల్లికి వచ్చే పర్యాటకులను మరింత ఆకట్టుకోవచ్చన్న ఆలోచనతో పార్కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సువిశాల స్థలంలో రూ.20 లక్షల వ్యయంతో దీన్ని సిద్ధం చేశారు. పర్యాటకులతో పాటు పిల్లలను ఆకర్షించేలా పార్కును ఆట వస్తువులు, సింహం, పులి, జిరాఫీ, ఫొటో ఫ్రేమ్, బుద్ధ విగ్రహం, ఫ్రూట్‌కట్ బెంచీ, రాయల్‌ఫామ్ మొక్కలు, లాన్ గార్డెన్, ప్లాంటేషన్‌తో సుందరంగా తీర్చిదిద్దారు. ఓపెన్‌జిమ్, వాకింగ్ ట్రాక్, టాయ్‌లెట్లు ఏర్పాటు చేశారు. పార్కు చుట్టూ ప్రహరీ నిర్మించి గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా రంగులతో తీర్చిదిద్దారు.



ప్రారంభోత్సవానికి సిద్ధంగా లేక్‌వ్యూ పార్కు



పార్కులో పిల్లల కోసం ఆట వస్తువులు



పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

ఈ నెలాఖరులో ప్రారంభిస్తాం



జిల్లాలోనే జలాల్‌పురం లేక్‌వ్యూ పార్కును మోడల్‌గా తీర్చిదిద్దుతున్నాం. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. అందుకుఅనుగుణంగా అన్ని హంగులతో సుందరంగా తీర్చిదిద్దుతున్నాం. పార్కు సుందరీకరణ పనులు పూర్తి కావొచ్చాయి. ఎమ్మెల్యేతో మాట్లాడి ఈ నెలాఖరులోగ పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం.

-ఏ.బాలశంకర్, ఎంపీడీఓ, భూదాన్‌పోచంపల్లి

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధం

త్రిపురారం: షార్ట్ సర్క్యూట్ జరిగి పూరి గుడిసె దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పడిశల నాగయ్య, రమణ దంపతులు కూలీ పనులు చేసుకుంటూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బజారులో పూరి గుడిసెలో నివాసముంటున్నారు. మహాశివరాత్రి సందర్భంగా శనివారం ఉదయం వారు నివాసముంటున్న గుడిసెకు తాళం వేసి స్థానికంగా ఉన్న దేవాలయానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. ఆ సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి నిప్పు రవ్వలు గుడిసెకు అంటుకున్నాయి. చుట్టుపక్కల వారు మంటలు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో విలువైన సామగ్రితో పాటు ఎల్లమ్మ పండుగ చేయడానికి దాచుకున్న రూ.60వేల నగదు, బియ్యం, వస్తువులు, దుస్తులు కాలిబూడిదయ్యాయి. నిరుపేదనైన తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

తేనెటీగల దాడి

మునుగోడు: తేనెటీగలు దాడి చేయడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలు.. మునుగోడు గ్రామ శివవారులోని బొడ్డు పెద్ద చంద్రమౌళిగౌడ్ తన వ్యవసాయ పొలం వద్దకు తన స్నేహితులైన గంజి నర్సింహరావు, మిఖేల్‌తో కలసి శనివారం ఉదయం వెళ్లాడు. అయితే అక్కడే ఓ చెట్టుపై ఉన్న తేనెటీగలు ఒకసారిగా లేచి ముగ్గురిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. ఈ క్రమంలో చంద్రమౌళిగౌడ్, నర్సింహరావు స్పృహ కోల్పోయి కింద పడిపోయారు. చుట్టుపక్కల వారు గమనించి 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్పృహ కోల్పోయిన ఇద్దరినీ ఐసీయూలో ఉంచి దాక్టర్లు వైద్యం అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మిర్యాలగూడ టౌన్: దామరచర్ల మండలం కొండ్రపోలు శివారులో గల ఎల్–3 కెనాల్‌లో శనివారం గుర్తుతెలియని వ్యక్తి(40) మృతదేహం లభ్యమైనట్లు వాడపల్లి ఎస్‌ఐ మామిడి రవికుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొండ్రపోలు శివారులో ఎల్–3 కెనాల్‌లో దుర్వాసన వస్తుండడంతో స్థానికులు గుర్తించి వాడపల్లి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మృతుడు ఎరుపు రంగు చొక్కా ధరించాడని, దానిపై ఆక్స్‌ఫర్డ్ టైలర్ కోదాడ అని ఉందని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహం 10రోజుల క్రితం నీటిలో కొట్టుకొని వచ్చి ఉండవచ్చని అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు 9440795605, 9440795607 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్‌ఐ సూచించారు.

మార్మోగిన శివనామస్మరణ


నేరేడుచర్ల: బురుగులతండా సోమప్ప ఆలయంలో శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు


మోత్కూరు పట్టణంలో మహాశివరాత్రి బోనాలు నిర్వహిస్తున్న మహిళలు


నార్కట్‌పల్లి: చెర్వుగట్టులో స్వామి వారి దర్శనానికి బారులుదీరిన భక్తులు


నకిరేకల్‌లో పండ్లు, కూరగాయలతో శివలింగం నమూనా


పిల్లలమర్రిలోని శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు


పానగల్లులో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


పానగల్లులోని ఛాయా సోమేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


ఆలేరురూరల్: కొలనుపాకలో కోటి లింగాలను దర్శించుకున్న భక్తులు


పిల్లలమర్రిలో శివుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు


వాడపల్లిలోని శ్రీమీనాక్షి అగస్తేశ్వర ఆలయంలో భక్తులు

రైలు కింద పడి ఇద్దరు యువకులు దుర్మరణం

- పగిడిపల్లి వద్ద రైల్వే స్టేషన్ సమీపంలో మృతదేహాలు లభ్యం

బీబీనగర్: బీబీనగర్ పరిధిలోని పగిడిపల్లి వద్ద రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం ఇద్దరు యువకులు రైలు కింద పడి మృతిచెందారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చెలువాయి గ్రామానికి చెందిన నారమళ్ల నరేష్(29) ఈ నెల 15న హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి 17న ఇంటికి వెళ్తుండగా పగిడిపల్లి సమీపంలోని రైలు కింద పడి మృతిచెందాడు. అదే రోజు శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం వాలేటిపాలెం గ్రామానికి చెందిన గుత్తి శ్రీధర్(26) పని నిమిత్తం హైదరాబాద్‌కు వస్తుండగా పగిడిపల్లి సమీపంలోని మరో రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని రైలు కింద పడి మృతిచెందాడు. శనివారం రైల్వే ట్రాక్‌పై పడి వున్న మృతదేహాలను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకొని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతులిద్దరూ అవివాహితులు అని, ప్రమాదవశాత్తు రైలు కింద పడి చనిపోయి ఉంటారా లేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

153 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన రేషన్ బియ్యాన్ని చూపుతున్న ఎస్‌ఐ గోపికృష్ణ తదితరులు

నకిరేకల్: మండలంలోని కడపర్తి శివారులో ఓ వ్యవసాయ బావి వద్ద నిల్వ ఉంచిన 153 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. నకిరేకల్ సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కడపర్తి గ్రామానికి చెందిన యాదగిరి వ్యవసాయ బావి వద్ద షెడ్డులో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం అర్ధరాత్రి ఎస్‌ఐ గోపికృష్ణ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 153 క్వింటాళ్ల(370 బస్తాలు) బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బియ్యాన్ని సీజ్ చేసి నకిరేకల్‌లోని సివిల్ సప్లై గోదాంకి తరలించారు. నోముల గ్రామానికి చెందిన గుండగోని చంద్రశేఖర్ ఈ రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు గుర్తించామని సీఐ తెలిపారు. డీటీసీఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

కోదాడరూరల్: కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని గుడిబండ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. నడిగూడెం ప్రాంతంలో ఓ రైస్ మిల్లులో పనిచేసే బిహార్‌కు చెందిన ఇద్దరు కార్మికులు బైక్‌పై మేళ్లచెర్వు జాతరకు వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో గుడిబండ శివారుకు రాగానే ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొని పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలు కావడంతో కోదాడ ఆస్పత్రికి తరలించారు. కారులో ఉన్నవారు స్వల్ప గాయాలతో బయటపడినట్లు స్థానికులు తెలిపారు.


బైక్‌ను ఢీకొట్టి పొలంలోకి దూసుకెళ్లిన కారు

12మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.3,37,000 నగదు, 12 సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- రిమాండ్‌కు తరలింపు


పేకాటరాయుళ్ల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్‌లు

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి శివారులో పేకాట ఆడుతున్న పన్నెండు మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకోగా, వారిని అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు నార్కట్‌పల్లి సీఐ కె. శివరాంరెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శనివారం చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వెల్లడించారు. శుక్రవారం పెద్దకాపర్తి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పలువురు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పన్నెండు మందిని పట్టుకున్నారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.3,37,000 నగదు, పన్నెండు సెల్‌ఫోన్‌లు, మూడు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో మిర్యాలగూడ మండలంలోని యాదగిరిపల్లికి చెందిన గునగంటి కిరణ్‌తో పాటు అయితగోని భుజంగౌడ్, షేక్ మహబూబ్ బాషా, షేక్ ఉమర్ అలీ, తాటిచెట్టు రాఘవేందర్, గుడిపాటి శ్రీనివాస్, గంజి రవికుమార్, జిన్నే అనంతరెడ్డి, ఇమ్మడి కిరణ్‌కుమార్, కమ్రద్రి సంతోష్, వంగ గోపి, కోలా రాములు ఉన్నారు. పగిళ్ల రమేష్ అనే మరో వ్యక్తి పరారైనట్లు సీఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. గునగంటి కిరణ్ ఎప్పటికప్పుడు అడ్డాలను మార్చుతూ నల్లగొండతో పాటు హైదరాబాద్, చౌటుప్పల్ ప్రాంతాలకు చెందిన వారితో పేకాట ఆడిస్తుంటాడని సీఐ పేర్కొన్నారు. పట్టుబడిన వారిపై ఇప్పటికే జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ ఎన్. ధర్మా పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం.. ఐదుగురి అరెస్ట్


పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

హుజూర్‌నగర్‌రూరల్: హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారం, మేళ్లచెర్వు మండలంలోని హేమ్లాతండాలో శనివారం హుజూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు, డీటీఎఫ్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి సుమారు 400లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగర్జునరెడ్డి తెలిపారు. అదేవిధంగా 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ ఏలే శ్రీనివాస్, ఎక్సైజ్ ఎస్‌ఐ వెంకన్న, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చౌటుప్పల్: మండల పరిధిలోని ఎల్లం బావి గ్రామ శివారులో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన రత్నావత్ సంతోష్(20) డిగ్రీ చదువుతున్నాడు. సొంత పనిమీద ద్విచక్ర వాహనంపై హైదరాబాద్కు వెళ్లాడు. తిరిగి సూర్యాపేటకు వెళ్తుండగా క్రమంలో మండల పరిధిలోని ఎల్లం బావి గ్రామ శివారులోని అండర్ పాస్ దాటిన తర్వాత రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. అనంతరం స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టి కల్యాణం జరిపారు. నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ఛైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, వంశీకృష్ణమాచార్యులు,, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

చెట్టు పైనుంచి పడి వృద్ధుడు మృతి

మోత్కూరు: చింతచెట్టు పైనుంచి పడి వృద్ధుడు మృతిచెందిన ఘటన మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ కేంద్రంలోని యాదవ కాలనీకి చెందిన బొడిగె ఎల్లయ్య (70) శనివారం ఉదయం చింతపండు తెంపడానికి స్థానిక వైజే ఫంక్షన్ హాల్ సమీపంలోని చిప్పలపల్లి యాదగిరి వ్యవసాయ బావి వద్ద ఉన్న చింతచెట్టు ఎక్కాడు. చింతపండు తెంపుతుండగా ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారి పడటంతో ఎల్లయ్య తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా ఎస్‌ఐ జానకిరాంరెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మదార్ (ఫైల్)

మునగాల(కోదాడ): మండల పరిధిలోని నేలమర్రి గ్రామానికి చెందిన బచ్చలకూర మదార్(52) హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందినట్లు స్థానిక ఎస్‌ఐ పి. లోకేష్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చలకూర మదార్‌కు అదే గ్రామానికి చెందిన బచ్చలకూర సంజీవకు వ్యక్తిగత గొడవలు ఉన్నాయి. కాగా సంజీవ ఈ నెల 16వ తేదీ రాత్రి మదార్‌పై కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. దీంతో మదార్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి కుమారుడు నాగార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం


మహేష్ (ఫైల్)

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని వేల్పుచర్ల వద్ద సూర్యాపేట–జనగామ 365బీ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాయామ ఉపాధ్యాయుడు(పీఈటీ) దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన సైదుల మహేష్(22) కోదాడలోని గురుకుల విద్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగా శుక్రవారం విధులు ముగించుకొని స్వగ్రామం జాజిరెడ్డిగూడేనికి బైక్‌పై వస్తుండగా వేల్పుచర్ల వద్ద హైవేపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై కె. కృష్ణమూర్తి తెలిపారు. మృతుడు అవివాహితుడు కాగా, అతడి తండ్రి సోమనర్సయ్య నెల రోజుల కిందట అనారోగ్యంతో మృతిచెందినట్లు తెలుస్తోంది.

వేములపల్లిలో వృద్ధురాలు..


బాయమ్మ (ఫైల్)

మిర్యాలగూడ: వేములపల్లి మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి–అద్దంకి బైపాస్‌పై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండల కేంద్రానికి చెందిన గుండెబోయిన బాయమ్మ(68) సరుకులు తీసుకురావడానికి కిరాణా దుకాణానికి రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తుండగా నల్లగొండ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాయమ్మ తల, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే 108 వాహనంలో మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ సామియేల్ తెలిపారు.


నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్ వద్ద ఉదయం వేళ కమ్మేసిన మంచు.


మంచులో వెళ్తున్న వాహనాలు